



కనువిందుగా..

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం మంచిర్యాలకు చెందిన శ్రీ శార్వాణి కూచిపూడి నృత్యాలయ గురువు డాక్టర్ భార్గవ్ ప్రేమ్ శిష్యబృందం కూచిపూడి ప్రదర్శనతో అలరించారు. ఇందులో వినాయకకౌతం, స్వాగతం కృష్ణ, జతిస్వరం, కృష్ణశబ్దం, దశావతారశబ్దం తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు మహాలక్ష్మి, సాయిఅనన్య, చైత్రిక, విష్ణుప్రియ, లాస్య, మహన్య తదితరులు పాల్గొన్నారు. రాశీ సచ్చిదానంద శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

ఆధునిక సాగు, లాభదాయక పంటలపై దృష్టి పెట్టాలి

శంషాబాద్ రూరల్: రైతులు ఆధునిక సాగు పద్ధతులతో పాటు లాభదాయక పంటలపై దృష్టి పెట్టాలని సర్వోదయ మండలి కార్యదర్శి శ్రీనివాస్ సూచించారు. మండలంలోని గండిగూడలో ఆదివారం భాటి వ్యవసాయ క్షేత్రంలో బహుళ పంటల సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. దీర్ఘ, స్వల్ప కాలిక పంటలను ఒకే చోట పండించడం ద్వారా ఆదాయం వచ్చే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. అవకాడో, మునగ, బీర, దొండ, బీర, అల్లం పంటను ఒకే చోట సాగు చేస్తున్న విధానాన్ని రైతులకు వివరించారు. కలుపు నివారణ కోసం మల్చింగ్ షీట్, డ్రిప్‌తో నీరు అందించడంతో కూలీల ఖర్చు, తక్కువ నీటి అవసరం ఉంటుందని వివరించారు. ఇక్కడ సాగు చేస్తున్న జెరేనియం సుగంధ పంట సాగు విధానాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్రం నిర్వాహకులు బన్‌కట్ లాల్ భాటీ, రైతు రాజశేఖర్, వివిధ మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

నడిగడ్డతండాలో తీజ్ వేడుకలు



తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే గాంధీ, తండావాసులు

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డతండాలో తీజ్ పర్వదిన వేడుకలను ఆదివారం గిరిజనులు ఘనంగా నిర్వహించుకున్నారు. వేడుకలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు. తీజ్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... భారత సంస్కృతి సంప్రదాయాలను కాపాడిన మహనీయులు సేవాలాల్ మహారాజ్ అని దేశం కోసం, ధర్మం కోసం ఆయన పాటుపడ్డారని కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు మోహన్ ముదిరాజ్, గంగాధర్, నడిగడ్డతండావాసులు స్వామి నాయక్, లకపతి నాయక్, తిరుపతి నాయక్, శంకర్ నాయక్, రత్నాకర్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



బోనాల వేడుకలో పాల్గొన్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని పాత ఎంఐజీ కాలనీలో లలిత పోచమ్మ బోనాల వేడుకలో కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె అమ్మవారి పూజలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలవారికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

గుంతలమయం

జగద్గిరిగుట్ట: వర్షాలతో బాటు నిత్యం మురుగు పొంగుతుండడంతో జగద్గిరిగుట్ట–ఆల్విన్ కాలనీ వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డుకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



ఎటు చూసినా చెత్త కుప్పలు, వ్యర్థాలు

వర్షాలకు దుర్వాసన.. దోమలు, ఈగల వృద్ధి



దీప్తిశ్రీనగర్ కాలనీలో..



ఎంఏనగర్ కాలనీలో..



శాంతినగర్ కాలనీలో రోడ్డు పక్కన చెట్ల కొమ్మలు



మియాపూర్ విశ్వేశ్వర కాలనీలో రోడ్డు పక్కన చెత్త కుప్పలు

కాలనీలు, బస్తీలలో ఎటు చూసినా చెత్తచెదారం దర్శనమిస్తుంది. రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. ఇక వర్షాలు పడి చెత్త కుళ్లిపోయి దుర్వాసన వస్తోందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఐదు రోజుల పాటు స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమం నిర్వహించినా కాలనీలో ఎక్కడ శుభ్రత, పచ్చదనం కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మియాపూర్, చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్, శాంతినగర్, ఎంఏనగర్, స్టాలిన్‌నగర్, విశ్వేశ్వర కాలనీ, లక్ష్మీనగర్ న్యూ కాలనీ, నడిగడ్డతండా, సుభాష్‌చంద్రబోస్ నగర్ పలు కాలనీ, బస్తీలలో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. రోజుల తరబడి చెత్తను తొలగించకపోవడంతో చెత్త గుట్టలుగా పేరుకుపోతోంది. ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

– మియాపూర్

సర్వే నిర్వహించి అక్రమ కట్టడాలను తొలగించాలి

ఆల్విన్‌కాలనీ: చెరువులు, నాలాల సర్వే నిర్వహించి, వాటి పరిధిలో నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేయాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. హైడ్రా పేరుతో హడావుడికే పరిమితం కాకుండా ప్రతి అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలన్నారు. అదేవిధంగా అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చిన వివిధ శాఖల అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
ఎమ్మెల్యే కృష్ణారావు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ వారి ఆధ్వర్యంలో ఆదివారం బాలాజీనగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఉచిత సేవలు నిర్వహిస్తున్న యశోద ఆసుపత్రి వారిని అభినందించారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ చౌదరి, డా. వెంకట్‌రావు, కె.నాగరాజు, రవీందర్ రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు వినతి



జగదీశ్వర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న ఇజ్జత్‌నగర్‌వాసులు

శేరిలింగంపల్లి: ఇజ్జత్‌నగర్‌లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరుతూ శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్‌కు కాలనీవాసులు వినతిపత్రాన్ని అందజేశారు. నల్లగండ్లలోని ఆయన నివాసంలో ఇజ్జత్‌నగర్ వీకర్ సెక్షన్ బస్తీలో నూతనంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు ఆదివారం ఆయనను కలిశారు. బస్తీలో శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ దశలవారీగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షుడు మూడావత్ కృష్ణ నాయక్, గౌరవ అధ్యక్షుడు నీలం బ్రహ్మయ్య యాదవ్, గౌరవ సలహాదారు కేశవులు, రాంచందర్‌యాదవ్, కృష్ణముదిరాజ్, తిరుపతయ్య, హుస్సేన్, అలీమ్, రమేష్‌నాయక్, చందు, రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వీరశైవ మహా పాదయాత్ర ప్రారంభం



జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే

పటాన్‌చెరు టౌన్: విశ్వశాంతి కోసం వీరశైవ సమాజం ఆధ్వర్యంలో పటాన్‌చెరు నుండి బొంతపల్లి వీరభద్రస్వామి దేవస్థానం వరకు పాదయాత్ర చేపట్టడం అభినందనీయమని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు వీరశైవ సమాజం ఆధ్వర్యంలో పట్టణంలోని ఉమామహేశ్వర ఆలయం నుండి బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయం వరకు చేపట్టిన 17వ మహా పాదయాత్రను ఆదివారం ఎంపీ, ఎమ్మెల్యేలు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు అధ్యక్షులు నర్సింహారెడ్డి, పాదయాత్ర కమిటీ అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రాజు, సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



హేమదుర్గా మాత ఆలయంలో జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

మియాపూర్: ప్రతిఒక్కరూ దైవచింతనను కల్గివుండాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి. జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ హేమదుర్గా మాత దేవాలయ 24వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్, నియోజకవర్గ నాయకులు, డివిజన్ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అభిషేకాలు, హోమం, కుంకుమార్చన, అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

వర్షం పడితే.. ఇలా

నిజాంపేట్: వర్షం పడిదంటే చాలు ఈ రోడ్డు నీటి కుంటగా మారుతోంది. దీంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని ఆదిత్యాగార్డెన్ నుండి ప్రగతినగర్‌కు వెళ్లే రోడ్డు వర్షం పడిదంటే చాలు మోకాలి లోతు నీళ్లు వచ్చి చేరుతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కురిసిన వర్షానికి ఈ మార్గంలో భారీగా వరదనీరు వచ్చి చేరింది. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ మార్గంలో వరదనీరు సాఫీగా వెళ్లేలా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



చిన్నపాటి కుంటను తలపిస్తున్న ఆదిత్యగార్డెన్స్- ప్రగతినగర్ రోడ్డు

మద్యం మత్తు.. రోడ్డు ప్రమాదాలు

- 'నిషా'చరులపై పోలీసుల నజర్!
- మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వైనం
- తనిఖీల్లో పట్టుబడుతున్న వాహనదారులు
- రెండోసారి పట్టుబడితే జైలుకే...
- కొన్ని సందర్భాల్లో డ్రైవింగ్ లైసెన్స్ రద్దు
- వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో 5,540 కేసులు నమోదు
- రోజూ కొనసాగుతున్న డ్రంకన్‌డ్రైవ్ టెస్ట్‌లు



డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసు (ఫైల్)

ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్ని..

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్	డ్రంకన్ డ్రైవ్ కేసులు
పంజగుట్ట	1152
ఎస్సార్‌నగర్	1817
జూబ్లీహిల్స్	1465
బంజారాహిల్స్	1106

బంజారాహిల్స్: అతిగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్న వారికి భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తున్నా వాహనదారుల్లో ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. మద్యం మత్తులో డ్రైవింగ్ చూస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న కేసులు భారీగా నమోదవుతున్నాయి. ఒకటి కంటే ఎక్కువసార్లు మద్యం సేవించి పట్టుబడితే జైలుశిక్ష కూడా విధిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పరిస్థితి తీవ్రతను గుర్తించిన న్యాయమూర్తి డ్రైవింగ్ లైసెన్స్‌ను కూడా రద్దు చేస్తున్నారు. అయినా సరే కొంత మంది రెండు, మూడుసార్లు కూడా డ్రంకన్ డ్రైవ్‌లో చిక్కుతున్నారు. ప్రతిరోజూ ట్రాఫిక్ పోలీసులు వేర్వేరు చోట్ల డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తూ మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి వారిని కౌన్సెలింగ్‌కు హాజరుపరుస్తున్నారు. అంతేకాకుండా న్యాయస్థానంలో కూడా హాజరుపరుస్తున్నారు. ఒకసారి కంటే ఎక్కువ పట్టుబడ్డ వారికి జైలు శిక్ష విధిస్తూ రూ.3300 జరిమానా కూడా విధిస్తున్నారు. మొదటిసారి పట్టుబడ్డ వారికి రూ. 2100 జరిమానా విధిస్తున్నారు.

◆ పబ్‌లు, క్లబ్‌లు అత్యధికంగా ఉన్న జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజగుట్ట ప్రాంతాల్లో రోజూ ఎక్కడో చోట డ్రంకన్ డ్రైవ్ టెస్ట్‌లు జరుగుతున్నాయి. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ ఈ తనిఖీల్లో 15–20 మంది వరకు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి జులై 31వ తేదీ వరకు ఏడు నెలల వ్యవధిలో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్ఆర్‌నగర్, పంజగుట్ట పోలీస్‌స్టేషన్ల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 5,540 మంది పట్టుబడ్డారు.

◆ ఇందులో 150 మందికి పైగా జైలు శిక్ష పడింది. పెద్ద మొత్తంలో జరిమానాలు చెల్లించారు. చాలా వాహనాలు ఈ డ్రైవ్‌లో సీజ్ అయి సరైన ధ్రువ పత్రాలు లేక ఇంకా ఆయా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఆవరణలోనే మగ్గుతున్నాయి. మద్యం సేవించి వాహనాలు నడపరాదంటూ ట్రాఫిక్ పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నా మార్పు రావడం లేదు.

◆ వెస్ట్ జోన్ ట్రాఫిక్ పరిధిలో మొత్తం 5,540 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు కాగా, ఇందులో 2,660 కార్లు ఉన్నాయి. బెంజ్ కార్లు 30 ఉండగా, బీఎండబ్ల్యూ కార్లు 40 వరకు ఉన్నాయి. ఆడి కార్లు 38 పట్టుబడ్డాయి. ఖరీదైన కార్లు పెద్ద సంఖ్యలో డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడుతున్నాయి.

◆ మాదాపూర్, జూబ్లీహిల్స్‌లోని పబ్‌ల్లో పీకలదాకా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్న వారే అధికంగా ఉంటున్నారు. కాగా వారం రోజుల క్రితం బంజారాహిల్స్ పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో మద్యం మత్తులో ఉన్న ఓ మహిళ బ్రీత్ ఎనలైజర్ టెస్ట్‌కు ససేమిరా అంటూ విధులకు ఆటంకం కలిగించింది. ఓ ట్రాఫిక్ పోలీసు ఫోన్‌ను ధ్వంసం చేసింది.

◆ ఇలా మద్యం మత్తులో వీరంతా మితిమీరిన వేగంతో దూసుకెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. 2నెలల వ్యవధిలో జూబ్లీహిల్స్‌లో మద్యం మత్తులో కార్లు నడిపిన ఘటనల్లో ఆరు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

ఇలా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోనూ మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాల కేసులు భారీగా నమోదవుతున్నాయి.

రేపు సాయిదత్త గణపతి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

రాయదుర్గం: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం టెలికామ్‌నగర్‌లో వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వేడుకల్లో భాగంగా ఆలయంలో సాయంత్రం 4.30 గంటలకు శ్రీకృష్ణ అష్టోత్తర నామార్చన, 6.15 గంటలకు బాబాకు హారతి, రాత్రి 7 గంటలకు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 25, పచ్చిమిర్చి 50, బెండ 40, కాకర 40, దొండ 30, దోస 30, ఆలు 40, చామ 50, కీర 40, బీర 40, వంకాయ 30, గోకర 50, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 60, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (3)20 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 180, వెల్లుల్లి 280.

రేపటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ, 9వ ఫేజులోని శ్రీ విజయ గణపతి ఆలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. 27వ తేదీ మంగళవారం ఉదయం 8గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, ఋత్విక్కరణ, పంచగవ్య ప్రాశన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అఖండ స్థాపనాది కార్యక్రమాలతో ప్రారంభించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ధ్వజపటం కట్టడం, అగ్ని ప్రతిష్ఠాపన, గణపతి హోమం వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 29వ తేదీ గురువారం సాయంత్రం 6 గంటలకు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుచే ప్రవచనం ఉంటుందని తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఈఎన్‌టీ ఉచిత వైద్యశిబిరం

మోతీనగర్: ఆర్‌కె సొసైటీ ఇండోర్ షటిల్ కోర్టు స్టేడియం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు ఉచిత ఇఎన్‌టీ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ శిబిరాన్ని పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు ఆయా ప్రాంతాల్లో సమాచారం తెలియజేయాలని కోరారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ముఖ్యం



నవోదయ కాలనీలో సీసీ రోడ్డును పరిశీలించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని నవోదయ కాలనీలో 20 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డును డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా అంచుల వద్ద మట్టి వేసి క్యూరింగ్ చేయాలన్నారు. త్వరగా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బీవి రమణ, రాజిరెడ్డి, బాలస్వామి, గణేష్, శివశంకర్, లక్ష్మణ్, మదన్ కుమార్, వాసుదేవరావు, కిషోర్‌రెడ్డి, రాఘవరాజు తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడలో జరిగిన పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు.అనంతరం నిర్వాహకులు కార్పొరేటర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లింక్‌ను క్లిక్ చేశాడు.. నగదు పోగొట్టుకున్నాడు

రూ. 2 లక్షల పదివేలు మాయం

పటాన్‌చెరు టౌన్: సెల్‌ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేసిన ఘటనలో ఓ వ్యాపారి రూ.2 లక్షల పదివేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందిన ఓ వ్యాపారికి ఈ నెల 23వ తేదీ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు ఆ లింకును క్లిక్ చేయగా బాధితుడి ఖాతాలో ఉన్న రూ. రెండు లక్షల పదివేలు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచారం కేసులో వ్యక్తి అరెస్ట్

గచ్చిబౌలి: అత్యాచారం కేసులో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మాదాపూర్ ఏసీపీ సీహెచ్.శ్రీకాంత్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలిలో నివాసం ఉండే ఎస్.ప్రభాకర్‌రెడ్డి(40) డీఎల్ఎఫ్ వద్ద వరలక్ష్మీ టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. కాగా ఇతనికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ యువతి(35) పరిచయమైంది. ఇద్దరు కొంతకాలం కలిసి జీవించారు. ఈ క్రమంలో కొద్ది నెలల క్రితం పెళ్లి చేసుకుంటానని తనను నమ్మించి మోసం చేశాడని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై అత్యాచారం, అట్రాసిటీ కేసు నమోదు చేశారు. శనివారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నిబంధనలు పాటించని పబ్‌లపై కేసులు నమోదు

బంజారాహిల్స్: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న రెండు పబ్‌లపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్‌లోని లార్డ్స్ ఆఫ్ డ్రింక్స్, బ్రాండ్ వే పబ్‌లు శనివారం రాత్రి తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమయ్యాయి. ఈ రెండు పబ్‌ల యాజమాన్యం పార్కింగ్ సౌకర్యం కల్పించకపోవడంతో వాహనాలను రోడ్డు మీద పార్క్ చేశారు. దీంతో శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత 12.40 గంటల నుంచి 1.30 గంటల వరకు పబ్‌ల ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ నెలకొంది. ఈ క్రమంలో రాత్రి విధుల్లో ఉన్న ఎస్ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి ఫొటోలు, వీడియోలు తీశారు. ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు. కాగా పోలీసులు ఈ రెండు పబ్‌లపై సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.